సాక్షి ఆదిలాబాద్

గురువారం । 1 । ఆగస్టు । 2024



'కుంతాల'పై ఫోకస్

కుంతాల జలపాతం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎకోటూరిజం ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా కుంతాలతో పాటు 'కవ్వాల్'ను చేర్చింది. 8లో▸



అమ్మపాలు.. అమృతం

ప్రభుత్వం ఏటా ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం 29.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా అశోక్‌కుమార్

- ఫణిందర్ వరంగల్‌కు బదిలీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు చోటు చేసుకున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న డి.ఫణిందర్‌ను వరంగల్ జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఖమ్మం జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీహెచ్ అశోక్‌కుమార్‌ను నియమించింది. అలాగే ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న డి.అశోక్‌ను కోరుట్లకు బదిలీ చేసింది. కాగా హుజురాబాద్ ఎస్‌ఆర్‌వోగా పని చేస్తున్న మహ్మద్ మసూద్ అలీ ఆడిట్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. అలాగే బోథ్ సబ్‌రిజిస్ట్రార్ ఆర్. సాయినాథ్ బోధన్‌కు బదిలీ అయ్యారు. ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న ఎస్ రాజశేఖర్‌రెడ్డి నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా స్థానచలనం కలిగింది. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆదిలాబాద్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీరామరాజు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–2గా నిజామాబాద్ అర్బన్ కార్యాలయానికి బదిలీ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఆదిలాబాద్‌రూరల్: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి శ్రీధర్ మెట్‌పల్లివార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కొలాం ఆశ్రమ పాఠశాలలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఆదిలాబాద్ రూరల్ మండల వైద్యాధికారి సర్వరాజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలానికి స్పందన

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుశాఖలో ఉపయోగంలోని వస్తువుల కోసం నిర్వహించిన బహిరంగ వేలానికి స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం వేలం నిర్వహించారు. ఎస్పీ గౌస్ ఆలం హాజరై ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 103 మంది హాజరయ్యారు. ఇందులో కంప్యూటర్లు, ప్రింటర్లు, కిట్ ఆర్టికల్స్, పాతబడిన బెడ్లు, ఇనుప సామగ్రి, స్టోర్ వస్తువులు ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన మహ్మద్ అలీ ఫక్రుద్దీన్ రూ.6లక్షల 11వేలకు వేలంలో దక్కించుకున్నారు. మొత్తం 128 రకాల వస్తువులకు బహిరంగ వేలం వేశారు. ఇందులో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాస్, ఏవో భక్త ప్రహ్లాద్, సూపరింటెండెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో అన్నదాతకు అన్యాయం'



బడ్జెట్ ప్రతులు దహనం చేస్తూ..

ఎదులాపురం: కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు చిలుక దేవీదాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట బుధవారం సంఘ్ ఆధ్వర్యంలో కేంద్రబడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిసాన్ సమ్మాన్‌తోపాటు ఉపాధిహామీ, ఇతర సబ్సిడీ పథకాల్లో కోతలు విధించడం సరికాదన్నారు. కార్పొరేట్‌సంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్ ఉందనివిమర్శించారు. ఇందులో ఏఐకేఎంఎస్ నాయకులు దండేకర్ వామన్, ఏఐపీకేఎంఎస్ అధ్యక్షుడు కొడప సురేశ్, వెంకటనారాయణ, జగన్ సింగ్, శంకర్, సుభాష్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు శాఖలో అందించిన సేవలు అభినందనీయమని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన హెడ్‌కానిస్టేబుల్ ఆడె ఉత్తమ్‌ను బుధవారం పోలీసు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. అనంతరం వారిని పోలీసు వాహనంలో ఇంటి వరకు సాగనంపారు. ఇందులో సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మత్తడి దూకుతున్న కరత్వాడ చెరువు

నిండుకుండలు

- 'మత్తడివాగు' నుంచి దిగువకు నీళ్లు
- రాత్రి రెండు గేట్లు ఓపెన్.. ఆ తర్వాత మూసివేత
- 'సాత్నాల'కూ భారీగా వరద
- మత్తడి దూకుతున్న చెరువులు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలోని జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువయ్యాయి. చాలా చోట్ల చెరువులు మత్తడి దూకుతుండగా.. ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. తాంసి మండలం వడ్డాడి వద్ద ఉన్న మత్తడివాగు ప్రాజెక్ట్‌కు వరద పెరగడంతో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఆ తర్వాత ప్రవాహం తగ్గడంతో గేట్లు మూసివేశారు. జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టు కూడా పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువైంది.

భారీ వర్షాలు..

జిల్లాలో ఇటీవల రోజుల తరబడి ముసురు కమ్మేసింది. భారీ వర్షాలు కూడా నమోదయ్యాయి. బుధవారం జిల్లా వ్యాప్తంగా 29 మి.మీ.ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ వానకాలంలో ఇప్పటివరకు జిల్లాలోని ఆదిలాబాద్‌రూరల్, ఆదిలాబాద్‌అర్బన్ మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. నాలుగు మండలాల్లో అధిక వర్షపాతం, 12 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మొత్తంగా వానకాలం మొదలైన రెండు నెలల్లో జిల్లాలో భారీ వర్షాల కారణంగా జలాశయాలన్నీ నిండాయి.

వర్షపాతం వివరాలు (జూన్ 1 నుంచి జూలై 31 వరకు)..

సాధారణ వర్షపాతం	528.4 మి.మీ.లు
కురిసింది	640.6 మి.మీ.లు
వ్యత్యాసం	21శాతం అధికం
స్థితి	అధిక వర్షపాతం

చెరువుల పరిస్థితి..

మొత్తం చెరువులు: 392
75–100 శాతం నిండినవి:37
మత్తడి దూకుతున్నవి: 355

ప్రాజెక్టుల్లో నీటిమట్టం వివరాలు..

ప్రాజెక్ట్	పూర్తిస్థాయి నీటిమట్టం (మీటర్లు)	ప్రస్తుత నీటి మట్టం (మీటర్లు)	నిల్వసామర్థ్యం (టీఎంసీ)	ప్రస్తుతం (టీఎంసీ)
సాత్నాల	286.50	284.70	1.24	0.853
మత్తడి వాగు	277.50	276.50	0.571	0.446



మంగళవారం అర్ధరాత్రి మత్తడివాగు గేట్లు ఎత్తగా దిగువకు నీటి పరవళ్లు

ప్రాజెక్టుల పరిస్థితి..

- జిల్లాలో ఉన్న రెండు ప్రాజెక్టులూ మధ్యతరహావే. ఇందులో సాత్నాల ప్రాజెక్ట్‌కు నాలుగు గేట్లు ఉన్నాయి. ఈ వర్షాకాలంలో ఇప్పటివరకు ఆ గేట్లను ఎత్తలేదు. ప్రాజెక్టు కింద 24వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికింద లక్ష్మీపూర్ రిజర్వాయర్ కూడా ఉంది.
- ఇక మత్తడివాగుకు ఐదు గేట్లు ఉన్నాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. ఆ తర్వాత ప్రవాహం తగ్గడంతో వాటిని మూసివేశారు. ఈ ప్రాజెక్ట్ కింద 8,500 ఎకరాల ఆయకట్టు ఉంది.
- ఇక జిల్లాలో 392 చెరువులు ఉండగా, ఆదిలాబాద్ నియోజకవర్గంలో 63, బోథ్ నియోజకవర్గంలో 149, ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లిలో 142, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని నార్నూర్, గాదిగూడలో 38 ఉన్నాయి. వీటికి సంబంధించి వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు ఉన్నవి 193 చెరువులు ఉండగా, అంతకంటే తక్కువ ఉన్నవి 199 ఉన్నాయి. వీటి ద్వారా ఆయకట్టు రైతులకు ప్రయోజనం దక్కనుంది.

ముగిసిన బదిలీల ప్రక్రియ

- జిల్లాలో 46 శాఖల్లో 700 మందికి స్థానచలనం
- వ్యవసాయ, సహకార శాఖలకు దక్కని ప్రయోజనం



కైలాస్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ బధవారంతో ముగిసింది. ఆదిలాబాద్ జిల్లాలోని 46 ప్రభుత్వ శాఖల్లో నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సుమారు 700 మంది ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. సుదీర్ఘకాలంగా బదిలీ కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రయోజనం కల్పించేలా ప్రభుత్వం జూలై 5న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజు నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభించి గత 20వ తేదీతో ముగించాలని తొలుత ఆదేశించింది. అయితే అప్పటి వరకు వివిధ శాఖల్లో పలు కారణాలతో బదిలీల ప్రక్రియ జరగలేదని గుర్తించిన ప్రభుత్వం నెలాఖరు వరకు గడువు పొడిగించింది. ఈ క్రమంలో జిల్లాలోని పలు శాఖల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. జిల్లాస్థాయిలో ఉన్నతాధికారి నుంచి ఆఫీస్ సబార్డినేట్ వరకు నాలుగేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారిలో 40శాతం వరకు ఉద్యోగులను బదిలీ చేశారు. జిల్లా, జోనల్, మల్టీ జోనల్ క్యాడర్‌లోని అధికారులు, ఉద్యోగులకు రాష్ట్రస్థాయిలో ఆయా శాఖల ఉన్నతాధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా క్యాడర్‌లోని ఉద్యోగులకు కలెక్టర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి స్థానచలనం ప్రక్రియ పూర్తి చేశారు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల్లో ఎక్కువ మంది అధికారులు, ఉద్యోగుల బదిలీలు అయ్యాయి. మిగతా శాఖల్లో 20 నుంచి 50 మంది వరకు ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారంతా ఇప్పటికే తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరారు. అయితే రైతు రుణమాఫీ అమలు నేపథ్యంలో వ్యవసాయ, సహకార శాఖల్లో మాత్రం ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టలేదు. దీంతో బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆయా శాఖల వారికి ప్రయోజనం చేకూరలేదు. అలాగే పశుసంవర్ధక, ఆర్‌అండ్‌బీ శాఖల్లో ఉద్యోగులను బదిలీ చేయగా అధికారుల బదిలీలకు సంబంధించి బుధవారం వరకు ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో వారికి ఉత్తర్వులు జారీ చేస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కాగా బదిలీలపై నిషేధాన్ని విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఉద్యోగుల బదిలీలు నిలిచిపోనున్నాయి.

బల్దియా కార్యాలయానికి కరెంట్ కట్!

- బకాయిలపై విద్యుత్‌శాఖ సీరియస్
- రూ.22లక్షలు చెల్లించడంతో పునరుద్ధరణ



మున్సిపల్ కార్యాలయ భవనం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీకి విద్యుత్ శాఖ బుధవారం ఝలక్ ఇచ్చింది. దీర్ఘకాలంగా పేరుకుపోయిన బకాయిలు చెల్లించకపోవడాన్ని ఆ శాఖ తీవ్రంగా పరిగణించింది. మున్సిపల్ కార్యాలయానికి కరెంట్ సరఫరా నిలిపివేసింది. దీంతో కార్యాలయ పాలన వ్యవహారాలకు అంతరాయం ఏర్పడింది. బల్దియా కార్యాలయానికి సంబంధించి రూ.3కోట్ల మేర విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. వాటిని చెల్లించాలని అధికారులు పలు మార్లు నోటీసులు జారీ చేసినా బల్దియా నుంచి స్పందించలేదు. విసుగు చెందిన విద్యుత్‌శాఖ అధికారులు మధ్యాహ్నం 2గంటల సమయంలో బల్దియా కార్యాలయానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సుమారు రెండు గంటల పాటు కార్యాలయంలో చీకటి నెలకొనగా పాలన వ్యవహారాలకు అంతరాయం ఏర్పడింది. దీన్ని గుర్తించిన మున్సిపల్ అధికారులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించి సరఫరా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే బిల్లులు చెల్లించేవరకు సరఫరా చేయమని తెల్చిచెప్పారు. వెంటనే బల్దియా అధికారులు రూ.22లక్షలు చెల్లించడంతో పాటు తమకు కొంత సమయం ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు 4 గంటల ప్రాంతంలో కరెంట్ సరఫరా పునరుద్ధరించారు. గడువులోపు చెల్లించకుంటే సరఫరా మళ్లీ నిలిపివేస్తామని ఆ శాఖ అధికారులు హెచ్చరించడం గమనార్హం.

రిటైర్డ్ పోలీసు అధికారికి జైలు

- 2013లో ఏసీబీకి పట్టుబడ్డ వైనం
- ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20వేల జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: ఓ కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచే విషయంలో లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డ రిటైర్డ్ సీఐ చింతల లచ్చన్నకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ఏసీబీ స్పెషల్ కోర్టు జడ్జి వివేక్ తీర్పునిచ్చారు. ఏసీబీ కోర్టు పీపీ కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు ప్రస్తుతం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి పోలీసు స్టేషన్‌లో సీఐగా పనిచేసిన చింతల లచ్చన్న ఓ కేసులో నిందితుడి అరెస్టు చేయగా, ఆయన తల్లి ఉప్పుల శశికళ నుంచి 2013వ సంవత్సరంలో లంచం డిమాండ్ చేశారు. ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అప్పటి ఏసీబీ డీఎస్పీ టి.సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో ట్రాప్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ సీఐ రమణమూర్తి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, కోర్టు ప్రత్యేక సాక్షులను విచారించింది. వాంగ్మూలాన్ని సేకరించింది. ఆధారాలను పరిశీలించిన అనంతరం ఆయనకు బుధవారం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు వివరించారు.



రిటైర్డ్ సీఐ చింతల లచ్చన్న

యూత్ కాంగ్రెస్‌లో ఎన్నికల సందడి

- తొలిసారిగా ఆన్‌లైన్‌లో ఓటింగ్ ప్రక్రియ
- మద్దతు కోసం అభ్యర్థుల పాట్లు



ఓటింగ్‌కు ఉపయోగిస్తున్న యాప్

కైలాస్‌నగర్: జిల్లా యువజన కాంగ్రెస్‌లో ఎన్నికల సందడి నెలకొంది. బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఆన్‌లైన్ ఓటింగ్ కావడంతో కార్యకర్తల మద్దతు కోసం శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాజకీయంగా కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

బరిలో వీరే..

'హస్తం' పార్టీకి క్షేత్రస్థాయిలో వెన్నుదన్నుగా యువజన కాంగ్రెస్ నిలుస్తోంది. ఇందులో భాగంగా పార్టీ అధిష్టానం యూత్ కాంగ్రెస్ ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ఇప్పటివరకు ఆ విభాగం ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహించగా, తొలిసారిగా ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నారు. మండల స్థాయి నుంచి జిల్లా అధ్యక్షుడి వరకు ఈ ప్రక్రియనే కొనసాగనుంది. నామినేషన్ల దాఖలు నుంచి ఫలితాల వెల్లడి వరకు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే చేపట్టనున్నారు. జిల్లా అధ్యక్ష బరిలో ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్‌తో పాటు ప్రధాన కార్యదర్శి అర్బాత్, నార్నూర్, నేరడిగొండ మండలాలకు చెందిన మరో ఇద్దరు బరిలో నిలిచారు. ప్రధాన కార్యదర్శి పదవి కోసం ఉపాధ్యక్షుడిగా ఉన్న వేముల నాగరాజుతో పాటు సంగ అశోక్ పోటీ పడుతున్నారు. వీరితో పాటు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల అసెంబ్లీ అధ్యక్షులతో పాటు, మండల అధ్యక్ష పదవుల కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ముగిసింది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

ఆన్‌లైన్ ఎన్నికల నిర్వహణ కోసం 'విత్ ఐవైసీ' అనే ప్రత్యేక యాప్‌ను ఉపయోగిస్తున్నారు. ఈనెల 5 నుంచి సెప్టెంబర్ 5 వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుండడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు పార్టీ ప్రధాన నాయకుల ఆశీస్సులతో పాటు యువత మద్దతును కూడగట్టుకునే దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

- వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- కలెక్టర్ రాజర్షి షా



మొక్క నాటుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, క్రీడా పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు 30 లక్షల వరకు నాటినట్లు పేర్కొన్నారు. రానున్న 15 రోజుల్లో మిగతా లక్ష్యం పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. తమ పూర్వీకుల జ్ఞాపకార్థం మొక్కలు నాటితే ఒక స్మృతిగా మిగిలిపోతుందని, ఈ దిశగా అందరూ ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, ఎఫ్‌ఆర్వో గులాబీ సింగ్, మున్సిపల్ చైర్మన్ ఖమర్ అహ్మద్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల పరిశీలన

అనంతరం జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. డైనింగ్ హాల్, కిచెన్, డార్మెంటరీ కార్యాలయాన్ని పరిశీలించి, అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించడంతో పాటు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు స్టేడియంలోని రన్నింగ్ ట్రాక్‌పై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డీవైఎస్‌వోను ఆదేశించారు. ఆయన వెంట క్రీడా పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

జైనథ్: జాతీయ నూతన విద్యావిధానం–2020 ప్రారంభించి నాలుగేళ్లవుతున్న సందర్భంగా వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వేడుకలు బుధవారంతో ముగిశాయి. మండలంలోని పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ముగింపు వేడుకలను కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్న భోజన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. విద్యార్థులకు భోజనం కోసం ముందుకు వచ్చిన దాత రాజారెడ్డిని కలెక్టర్ అభినందించారు. అంతకు ముందు పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులతో ముచ్చటించారు. వారికి అందుతున్న పోషకాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, ప్రధానోపాధ్యాయురాలు శశికళ, తహసీల్దార్ శ్యాంసుందర్, మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆలింకో, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 18 ఏళ్లలోపు దివ్యాంగులకు ఉచిత పరికరాల పంపిణీకి సంబంధించి జిల్లా కేంద్రంలోని టీటీడీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. వైకల్యం ఉందని బాధపడకుండా సకలాంగులతో సమానంగా ముందుకు సాగాలని సూచించారు. శిబిరానికి 189 మంది దివ్యాంగులు హాజరయ్యారని, వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారికి పరికరాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, స్కాలర్‌షిప్ వస్తున్నాయా.. లేదా అని ఆరా తీశారు. ఇందులో డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, వైద్యులు పాల్గొన్నారు.

'మహిళాశక్తి' పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుకు శ్రీకారం చుట్టిన మహిళా శక్తి పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శక్తి కార్యక్రమం అమలుపై జిల్లా గ్రామీణాభివృద్ధి, సెర్ప్, లీడ్ బ్యాంకు, పశు సంవర్ధక, స్త్రీనిధి, పరిశ్రమలు, విజయ డెయిరీ శాఖల అధికారులతో పాటు, జిల్లా, మండల సమాఖ్య ప్రతి నిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి ఆయా సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడమే మహిళా శక్తి పథకం ప్రధాన లక్ష్యమన్నారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మినెంట్ స్టిచింగ్ సెంటర్లు, పాడి గేదెలపెంపకం, మొబైల్ ఫిష్‌అవుట్‌లెట్, పాల డెయిరీల ప్రోత్సాహం,మీసేవకేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరికరాలు, ఈవెంట్ మేనేజ్మెంట్ వంటి తదితర 14 రకాల యూనిట్ల కల్పన ఇందులో భాగమన్నారు. ఎంపికైన లబ్ధిదారులు తమ పథకాలు ఎప్పటికీ కొనసాగేలా మార్కెటింగ్ అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. సంబంధిత శాఖలు ముందుగా కొన్ని మోడల్ ప్రాజెక్టులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వీయా, డీఆర్డీవో సాయన్న, పశు సంవర్ధక శాఖ జేడీ బి.కిషన్, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా గంగాహారతి



గంగాహారతి ఇస్తున్న ఆలయ అర్చకులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గోదావరినది ఘాట్–1 వద్ద ఆలయ వైదిక బృందం సభ్యులు గంగాహారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాటేసిన పాము పట్టివేత



పట్టుకున్న పాముతో అటవీ,పోలీస్ అధికారులు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన అరుగుల గంగమ్మ (65) పాముకాటుతో మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, గంగమ్మ ఇంట్లో ఉండే పాముల పుట్టలోని నాగు పామును బుధవారం డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్, ఎస్సై లింబాద్రి, ఎఫ్‌బీవో ఖాసీం గ్రామస్తుల సమక్షంలో పట్టించారు. నిర్మల్‌కు చెందిన పాములు పట్టే వ్యక్తి యాసిన్ సహకారంతో పుట్టలోని పామును పట్టి దూరంగా ఉండే అటవీప్రాంతంలో వదిలిపెట్టారు. గ్రామస్తులు రాజేశ్వర్, శివ, సురేశ్ తదితరులున్నారు.

దుండగులను శిక్షించాలి

నర్సాపూర్ (జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహం కుడి చేతిని ధ్వంసం చేశారు. బుధవారం అంబేద్కర్ సంఘం నాయకులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు. అనంతరం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని నర్సాపూర్ (జి) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న గైక్వాడ్ రేఖ (27) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. రేఖ ఆమె సోదరి దీక్షతో కలిసి ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇంటి పనుల విషయంలో మూడు రోజుల క్రితం ఇద్దరి మధ్య మాటలు లేవు. మనస్తాపం చెందిన ఆమె ఉదయం ఉరేసుకుంది. వెంటనే 108కు సమాచారం అందించగా సిబ్బంది చేరుకొని పరిశీలించారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వారు నిర్ధారించారు. మృతురాలి సోదరి దీక్ష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అమ్మపాలు.. అమ్మృతం

- తాగితే బిడ్డకు.. తాగిస్తే తల్లికి రక్ష
- నేటి నుంచి ఈ నెల 7వరకు తల్లిపాల వారోత్సవాలు

మంచిర్యాలటౌన్: తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇంట్లో సంతోషం వెల్లివిరుస్తుంది. వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వమూ ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. ప్రతియేటా ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, తల్లి పాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బిడ్డకు తల్లిపాలు వరం, సురక్షితం, పుష్టికర ఆహారం.. అన్ని పోషకాలు అందించి రోగాల నుంచి రక్షించగలిగే అమృతమని వైద్యులు సూచిస్తున్నారు. పోతపాల కంటే తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా ఉంటారనేది నిరూపితమైన వాస్తవం. శిశువు సంపూర్ణ ఆరోగ్యం, వజ్ర సమానమైన రోగ నిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలు పట్టించాల్సిందే. పుట్టిన బిడ్డకు పాలు తాగిస్తే తల్లికీ లాభాలున్నాయి. ఎన్నో రకాల వ్యాధులు రాకుండా ఉంటాయి. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాలను బిడ్డ ఎంత వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి, రోజుకు ఎన్నిసార్లు పట్టాలి, ఎలా పట్టాలి, తల్లిపాలు పుష్కలంగా రావాలంటే ఏం తినాలి, ముర్రుపాలు ఎప్పుడు పట్టాలి... ఇలా చాలా అంశాలపై అందరికీ అవగాహన ఉండదు. ఆధునిక కాలం అమ్మలకు మరింత తక్కువ. ఇలాంటి అంశాలను వారికి తెలియజేస్తూ, తల్లిపాల ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటి నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు.

ఆరు నెలల వరకు..

బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే ముర్రుపాలను కచ్చితంగా శిశువుకు పట్టాలి. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులు, విటమిన్ 'ఏ' ఉంటుంది. బిడ్డ పుట్టిన గంట నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే పదార్థాలూ ఇవ్వకూడదు. తల్లి పాలు తేలికగా అరుగుతాయి. శుభ్రంగా, ఎటువంటి క్రీములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. దీనివల్ల ఎలాంటి వ్యాధులూ దరిచేరకుండా బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. తల్లిపాలు పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం, పాలు, చేపలు, గుడ్లు, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి.



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్(ఫైల్)

జిల్లాల వారీగా వివరాలు

	మంచిర్యాల	ఆదిలాబాద్	నిర్మల్	కుమురంభీం ఆసిఫాబాద్
అంగన్‌వాడీకేంద్రాలు	969	1256	976	973
బాలింతలు	3,902	5000	4073	3,939
గర్భిణులు	4,343	5000	6354	4,940
చిన్నారులు	31,144	22000	62744	48,004

బిడ్డకు ప్రయోజనం

తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి. నాణ్యమైన ప్రోటీన్లు, ఒమెగా 3, 6 అలాగే 9 బిడ్డ మెదడుకు వికాసానికి తోడ్పడుతాయి. పాలలో విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి. తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి. మృదువైన మల విసర్జన, మలబద్ధకం సమస్య నివారణకు తోడ్పడుతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి. తల్లిపాల ద్వారా బిడ్డలకు డయేరియా, న్యూమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండె జబ్బులు వంటి వ్యాధుల బారి నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. ఎలర్జీ, అస్తమా, డయాబెటీస్ వంటి వ్యాధులు రావు. బాల్యం, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లికి కలిగే లాభాలు..

తల్లులు చనుబాలు ఇవ్వడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతోపాటు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. చనుబాలు ఇచ్చినందువల్ల ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు. బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము, గర్భ సంచి క్యాన్సర్లు రావు. తల్లులకు మలి వయసులో వచ్చే అస్టియో పొరోసిస్(ఎముకల బలహీనత) నుంచి కాపాడుతుంది. తల్లి శిశువుల మధ్య బంధాన్ని పెంపొందిస్తుంది. తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినప్పుడు, టీకాలు ఇచ్చినప్పుడు కూడా పాలు పట్టించవచ్చు.

ఏటా వారోత్సవాలు



ప్రతియేటా తల్లి పాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో నిర్వహించడం జరుగుతుంది. అమ్మ పాల విశిష్టతను తెలిపేలా అవగాహన సమావేశాలు నిర్వహిస్తాం. గర్భిణులు, బాలింతలు తల్లి పాల విశిష్టతను తప్పకుండా తెలుసుకోవాలి. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరగడం, ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. పుట్టిన నాటి నుంచే బిడ్డలకు తల్లిపాలనే అందించాలి.

– ఉమాదేవి, జిల్లా ఇంచార్జి సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

గుట్కా దందా అరికట్టాలి



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఎదులాపురం: ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న గుట్కా దందాను అరికట్టాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్‌లో గుట్కా నివారణకు ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, మిగతా మూడు జిల్లాల్లో మాత్రం యథేచ్ఛగా ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని అన్నారు. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై అక్రమ దందా సాగిస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలించి ఏజెన్సీ ప్రాంతాల్లో బహిరంగంగా విక్రయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గుట్కా నివారణలో పోలీస్‌శాఖకు తుడుందెబ్బ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, ప్రజలు సైతం ముందుకు వచ్చి బాధ్యతగా గుట్కా నివారణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సంజీవ్, కోడప సోనేరావు, వెట్టి మనోజ్, జంగు పటేల్, ఆత్రం గణపతి, భుజంగరావు, ప్రకాష్, రాజు, దినేష్ తదితరులున్నారు.

బాసర హుండీ లెక్కింపు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో బుధవారం ఒడిబియ్యం, హుండీ లెక్కింపు నిర్వహించారు. 39 క్వింటాళ్ల ఒడిబియ్యం, 183 కిలోల ఎండు కొబ్బరి, 25 కిలోల బరిడి పోకలు, 40 కిలోల పసుపుకొమ్ములు, 15 కిలోల బాదం, 39 కిలోల ఖర్జూర పండ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నగదు రూపంలో రూ.81,039 ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

'కుంటాల'పై ఫోకస్



కుంటాల జలపాతం

- ఎకో టూరిజం కింద జలపాతం తోపాటు 'కవ్వాల్'ఎంపిక
- రూ.3.81 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

నేరడిగొండ: కుంటాల జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో ఎకోటూరిజం ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో భాగంగా 12 ప్రకృతి సర్క్యూట్లను ఇటీవల గుర్తించింది. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల జలపాతం, కవ్వాల్ టైగర్ ఫారెస్ట్‌ను చేర్చింది. ప్రకృతి పర్యాటకం పేరిట రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల పర్యాటకులను ఆకర్షించేందుకు అటవీ, జల వనరులు ఉన్న ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వానికి ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించగా, దీనికి సంబంధించి నిధులు మంజూరయ్యాయి.



కుంటాల జలపాతం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా (ఫైల్)

దూరప్రాంత పర్యాటకులకు సౌకర్యవంతంగా..

ఇదివరకు కుంటాల జలపాతం వద్ద హోటళ్లు, లాడ్జిలు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తాయి. ప్రస్తుతం ప్రభుత్వం రిసార్ట్, కాటేజ్ నిర్మాణాలు చేపట్టనుండడంతో వారికి సౌకర్యవంతంగా మారనుంది.

రూ.3.81కోట్లతో పనులు..

కుంటాల జలపాతం వద్ద పర్యాటకులు సేద తీరేందుకు హరిత రిసార్ట్, కాటేజీలు, పార్క్, విశాలమైన రోడ్డు, కాంపౌండ్ వాల్, పార్కింగ్ స్థలం తదితర సదుపాయాల కోసం ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం రూ.3.81 కోట్ల నిధులను మంజూరు చేసింది. స్థల సేకరణకు సంబంధించి ఇప్పటికే కలెక్టర్ రాజర్షి షా అధికారులతో కలిసి జలపాతం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. త్వరగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థల సేకరణ పూర్తయిందని, పనులు ప్రారంభిస్తామని ఎఫ్ఆర్‌వో గణేశ్ వెల్లడించారు. ఇందుకోసం ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

మౌంట్‌కున్ పర్వతం అధిరోహించిన ఆదిలాబాద్ వాసి



సభ్యులతో కలిసి మౌంట్‌కున్ పర్వతం వద్ద సాయికృష్ణారెడ్డి



మౌంట్‌కున్ పర్వతంపై జాతీయ జెండాతో సాయికృష్ణారెడ్డి

- 7,077 మీటర్లు ఎక్కిన సాయికృష్ణారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు కశ్మీర్‌లోని లడక్‌లో గల కార్గిల్ జిల్లాలోని 7,077 మీటర్ల మౌంట్‌కున్ పర్వతాన్ని అధిరోహించి రికార్డుకెక్కాడు. ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన విద్యుత్ శాఖ ఏఈగా పనిచేస్తున్న గన్ను జనార్దన్‌రెడ్డి–రమాదేవి దంపతుల కుమారుడు సాయికృష్ణారెడ్డి ఈ ఘనత సాధించాడు. ఈయన వైట్ మ్యాజిక్ అడ్వెంచర్ సంస్థ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో కలిసి ఈ పర్వతాన్ని జూలై 18న అధిరోహించాడు. తెలంగాణ నుంచి ఈయన ఉండగా, ఢిల్లీ నుంచి ఇద్దరు, పూణే నుంచి ఒకరు, ముంబాయి నుంచి ఒకరు ఉన్నారు. ఐఎంఎస్ ద్వారా సర్టిఫికెట్లు అందుకోనున్నారు. 2019 మే 21న మౌంట్ ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించగా, 500 మీటర్ల దూరంలో వాతావరణం అనుకూలించకపోవడంతో లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. పర్వతం 8,848 మీటర్ల ఎత్తులో ఉండగా, 8,300 మీటర్ల దూరంలో ఆగిపోయాడు. పదో తరగతి చదివినప్పటి నుంచే పర్వతాలను అధిరోహించడం ఈయన లక్ష్యమని చెబుతున్నాడు. కాగా 24 రోజుల్లో అధిగమించాల్సి ఉండగా, 18 రోజుల్లో మౌంట్‌కున్ పర్వతాన్ని అధిరోహించి రికార్డు సొంతం చేసుకున్నాడు. ప్రపంచంలో ఎత్తైన పర్వతం మౌంట్ ఎవరెస్ట్ ఎక్కడమే తన లక్ష్యమని చెబుతున్నాడు సాయికృష్ణారెడ్డి. ఈయన బీటెక్ పూర్తి చేశాడు.

ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీ



ఢీకొన్న ఆటోలు



చేయి విరిగిన మహిళ

- పది మందికి గాయాలు
- బోథ్‌లో ఘటన

బోథ్: ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న సంఘటన మండలకేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి ప్రయాణికులతో నక్కలవాడ, కొత్తపల్లి గ్రామానికి వెళుతున్న ఆటో, అలాగే మర్లపెల్లి నుంచి బోథ్‌కు వస్తున్న ఆటో మండలకేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోల్లో ప్రయాణిస్తున్న పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను బోథ్ సీహెచ్‌సీ, ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. గాయపడిన వారిలో బోథ్‌కు చెందిన కదం ఇందిర, బారె పద్మ, సంగెపు గంగామణి, సంగెపు అనూష, నాగమణి, నారాయణ, కొత్తపల్లి గ్రామానికి చెందిన మేస్రం నాగేందర్, కరత్వాడకు చెందిన షేక్ అగ్నాష్ ఉండగా మరో ఇద్దరి వివరాలు తెలియరాలేదు.

గోదావరిలో దూకి వివాహిత ఆత్మహత్య

బాసర: నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరినదిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ధర్మపురి కాలనీకి చెందిన వివాహిత తుమ్మల లక్ష్మి(32) బుధవారం బాసరలోని గోదావరి ఘాట్ వద్ద నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘాట్ వద్ద మృతురాలి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ లభించగా బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఘాట్ వద్దకు చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో లక్ష్మి మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య కారణాలే కారణమని మృతురాలి తల్లి అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



లక్ష్మి మృతదేహం

అటెండర్‌కు బ్యాండు మేళాతో వీడ్కోలు



బ్యాండు మేళాతో వీడ్కోలు పలుకుతున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

బోథ్: మండలంలోని కౌఠ బి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 22 ఏళ్లుగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న జమీర్ ఇటీవల జరిగిన బదిలీల్లో బోథ్ మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందిన జమీర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం బ్యాండు మేళాతో వీడ్కోలు పలికారు.

తప్పుడు ప్రచారం చేసిన నలుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియా (ఇన్‌స్టాగామ్)లో ఓ హోటల్‌కు సంబంధించి తప్పుడు ప్రచారం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని గ్రీన్‌లైన్ హోటల్‌లో తినవద్దని కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారని యజమాని సాయి కుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

ఉమ్మడి జిల్లాకు ఒకే ఒక్కడు!

- ఆ ఎంఈవో ఆదిలాబాద్‌కు కేటాయింపు
- 19 ఏళ్ల తర్వాత బదిలీ



సోమయ్య, ఎంఈవో

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక్కడిగా ఉన్న ఎంఈవో సోమయ్య ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన 19 ఏళ్ల క్రితం ఎంఈవోగా పదోన్నతి పొంది కొటాలలో విధులు నిర్వహిస్తున్నారు. కోర్టు కేసుల కారణంగా పదోన్నతి, బదిలీ పొందలేకపోయారు. 2005 తర్వాత ఉమ్మడి జిల్లాలో నలుగురు వరకు ఎంఈవోలు పనిచేశారు. వారు ఉద్యోగ విరమణ పొందడంతో ఈయన ఒకే ఒక్కడిగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. కోర్టు కేసు కారణంగా ఎంఈవో పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో ఆయన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనే 2005 నుంచి అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఎంఈవోలకు అవకాశం కల్పించడంతో మల్టీజోన్–1లో ఐదుగురికి స్థానచలనం జరిగింది. ఇందులో కొటాలలో పనిచేస్తున్న డి.సోమయ్య ఆదిలాబాద్‌అర్బన్‌కు బదిలీ అయ్యారు. గురువారం విధుల్లో చేరనున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఈయన 19 ఏళ్లుగా ఆసిఫాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై రావడంతో జిల్లాలో ఒక రెగ్యులర్ ఎంఈవో పోస్టు భర్తీ అయింది.

భారీ వాహనంతో ఇబ్బంది పడ్డ ప్రజలు

నిర్మల్ టౌన్: హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు భారీ ట్యాంక్‌తో వెళ్తున్న వాహనం మెహబూబా ఘాట్స్ ఎక్కలేదు. దీంతో బుధవారం నిర్మల్ మీదుగా తిరిగి బైపాస్ రోడ్డు నుంచి వెళ్లేందుకు వచ్చిన ఈ భారీ వాహనంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలోని బోయవాడ వద్ద గల చెట్ల కొమ్మలు వైర్లను తెంపుకొంటూ పోవడంతో స్థానికులు మండిపడ్డారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.



నిర్మల్ పట్టణంలోకి వచ్చిన భారీ వాహనం

వ్యక్తి అదృశ్యం

ఇంద్రవెల్లి: మండలంలోని తుమ్మగూడ గ్రామపంచాయతీ పరిధి పాలుండిగూడ గ్రామానికి చెందిన మడావి నాగోరావ్(47) అదృశ్యమైనట్లు ఎస్సై సునీల్ తెలిపారు. నాగోరావ్ ఈ నెల 29న రాత్రి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లాడు. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లతో పాటు పలుచోట్ల వెదికినా ఆచుకీ లభించలేదు. నాగోరావ్ భార్య దుర్పతబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మడావి నాగోరావ్(ఫైల్)